సాక్షి
నిర్మల్

సోమవారం, 29, మే, 2023

దాహం తీర్చని 'భగీరథ'

పల్లె జనం గొంతెండుతోంది. గుక్కెడు నీటి కోసం వారి అవస్థలు వర్ణనాతీతం. బిందెలతో కిలోమీటర్ల మేర నడిచి వెళ్తే గాని దాహార్తి తీరని దుస్థితి. ఇలా 'గిరి' పుత్రులకు బావులు, వాగులే దిక్కవుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామంటున్న పాలకుల మాటలు ఆచరణలో కనిపించడం లేదు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలోని పలు తండాలు, గూడేలకు ఇప్పటికీ మిషన్ భగీరథ నీరందని దుస్థితి. 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి వచ్చిన తాగునీటి ఇక్కట్లపై ఫోకస్.



- వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

4న నిర్మల్‌కు సీఎం కేసీఆర్

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అల్లోల

నిర్మల్ టౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 4న నిర్మల్‌కు సీఎం కేసీఆర్ రానున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి సీఎం ప్రారంభించనున్న కలెక్టరేట్ సముదాయం, బీఆర్‌ఎస్ కార్యాలయంతోపాటు బహిరంగ సభ నిర్వహించే స్థలం, హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్లపల్లి గ్రామ శివారులోని క్రషర్ రోడ్డులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ప్రజలు అధికసంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. జూన్ 2వరకు అన్ని పనులు పూర్తి చేయాలని, పార్కింగ్, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, నాయకుడు అల్లోల గౌతంరెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

'ఉత్సవాల్లో ఉద్యమకారులను భాగస్వాములను చేయాలి'

భైంసాటౌన్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను భాగస్వాములను చేయాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన భైంసాకు చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, గతంలో ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసహాయం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులు, పాటలతో ఉద్యమానికి ఊపుతెచ్చిన కళాకారులు, కవులు, దీక్షలు, ధర్నాలతో కేసుల పాలైనవారిని ఉద్యమకారులుగా గుర్తించి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. జిల్లాకు రానున్న సీఎం కేసీఆర్‌తో రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దీనిపై ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ కాల్వగడ్డలోగల మురళీకృష్ణ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, భక్తులు పాల్గొన్నారు.


అమ్మవార్లకు వినతిపత్రం సమర్పించి వీవోఏల నిరసన



బోనాలతో వెళ్తున్న వీవోఏలు

ముథోల్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వీవోఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆదివారం వారు నిరసన తెలిపారు. మహిళ వీవోఏలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని వేడుకున్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, ఇస్లాపూర్, శివుని ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, అభిషేకం, పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేదిక.. అందరిదిక!



తాండ్ర రైతువేదిక

- రైతువేదికల్లో 42 శాఖలకు అనుమతి
- అన్ని శాఖల సమావేశాలకు పర్మిషన్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 305 రైతువేదికలు

నిర్మల్‌చైన్‌గేట్: సాగులో సమస్యలు వస్తే అన్నదాతలు వ్యవసాయాధికారులను కలవాలంటే ఒకప్పుడు మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయాభావం, ఆర్థికభారం రైతులపై అదనంగా పడేది. వ్యవసాయాధికారులు సాగులో అధునాతన పద్ధతులు, యాంత్రీకరణ, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలంటే వేదిక దొరకడమే కష్టంగా ఉండేది. వీటన్నింటినీ గమనించిన రాష్ట్ర ప్రభుత్వం రైతువేదికలను నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. వేదిక కేంద్రంగా ప్రస్తుతం వారంలో రెండురోజులు వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆయిల్‌పామ్ సాగుపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ రైతువేదికల్లో ఇకనుంచి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమావేశాలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈమేరకు వ్యవసాయ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పరిధిలోని 42శాఖల వారు క్లస్టర్ స్థాయి సమావేశాలకు ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. దీంతో రైతువేదికలు ఇక అన్ని ప్రభుత్వ శాఖల కార్యక్రమాలకు వేదికలుగా మారనున్నాయి.

జిల్లా	మండలాలు	గ్రామాలు	క్లస్టర్లు	రైతువేదికలు
నిర్మల్	18	396	79	79
ఆదిలాబాద్	18	468	101	101
మంచిర్యాల	16	310	55	55
కుమురంభీం	15	335	70	70

ఉమ్మడి జిల్లాలో 305 రైతువేదికలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ప్రభుత్వం 305 రైతువేదికలు నిర్మించింది. ఒక్కో వేదికకు రూ.22 లక్షలు వెచ్చించింది. నిర్వహణకు నెలనెలా రూ.9 వేలు అందిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 18 మండలాలు, 468 గ్రామపంచాయతీలుండగా 101 రైతువేదికలు నిర్మించారు. నిర్మల్ జిల్లాలో 18 మండలాలు, 396 గ్రామపంచాయతీలుండగా 79, మంచిర్యాల జిల్లాలో 16 మండలాలు, 310 గ్రామపంచాయతీలుండగా 55, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలు, 335 గ్రామపంచాయతీలుండగా 70 వేదికలు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు.

ప్రస్తుతం వ్యవసాయశాఖ సమావేశాలే..

రైతువేదికల్లో ప్రస్తుతం వ్యవసాయశాఖకు సంబంధించిన సమావేశాలే నిర్వహిస్తున్నారు. ఏటా భూసార పరీక్షలకు సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేసి రైతులకు సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే భూసార పరీక్ష సామగ్రి వచ్చినా వాటికి అవసరమయ్యే రసాయనాలు సరఫరా చేయలేదు. దీంతో భూసార పరీక్ష కిట్లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన తాజా ఉత్తర్వులతో రైతువేదికలు అన్ని ప్రభుత్వ శాఖల సమావేశాలు, కార్యక్రమాలకు వేదిక కానున్నాయి.

ఏఈవోలు ఉండాల్సిందే..

క్లస్టర్‌కు ఒకరు చొప్పున వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)ను ప్రభుత్వం నియమించింది. రైతువేదికల నిర్వహణ వ్యవహారమంతా ఏఈవోలు చూసుకుంటున్నారు. వారు నిత్యం రైతువేదికలకు రావాల్సిందే. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో సంతకం చేయాలని ప్రభుత్వం కొత్త నిబంధన తెచ్చింది. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే.. రిజిస్టర్లో వివరాలు రాసి పెట్టాలని పేర్కొంది. మండలాల్లో పర్యటనకు వచ్చే జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులు రైతువేదికలను సందర్శించాలని సూచించింది.

ఆదేశాలు అందాయి



రైతువేదికల్లో వ్యవసాయ అనుబంధ శాఖలు కూడా సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. వీటిని ఆయా శాఖల అధికారులకు చేరవేశాం. ఏఈవోలు కూడా రైతువేదికలకు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాలి.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



కంట్రోల్‌రూం ప్రారంభిస్తున్న మంత్రి అల్లోల

నిర్మల్‌రూరల్: నేరాల నియంత్రణ, నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్, మంత్రి సహకారంతో ఏర్పాటు చేసిన 100 సీసీ కెమెరాల కంట్రోల్‌రూంను కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం రాత్రి ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు మల్లేశ్, శ్రీనివాస్, నాయకులు రామ్‌కిషన్‌రెడ్డి, అల్లోల గౌతంరెడ్డి, మారుకొండ రాము, ట్రాఫిక్ ఎస్‌ఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించాలి

సోన్: మండలంలోని పాక్‌పట్ల సర్పంచ్ ఎల్చల గంగారెడ్డి, వీడీసీ సభ్యులు ఆదివారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కలిశారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులు, పాత హనుమాన్ మందిర పునర్నిర్మాణం, మహాలక్ష్మీ, వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ ముత్యాలమ్మ మందిరాల నిర్మాణం, బీసీ సంఘ భవనం, బీబీ నుంచి డబుల్‌రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వీడీసీ సభ్యులు గోపీగౌడ్, నర్సారెడ్డి, బుర్రయ్య, సోన్న నర్సయ్య, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే 'పండుగ'





వివిధ ఫిష్ వంటకాలు

- 8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. మృగశిర కార్తె సందర్భంగా ఏర్పాటు
- ఇప్పటికే 20మంది మహిళలకు శిక్షణ



నిర్మల్‌చైన్‌గేట్: ఫిష్ ఫ్రై, ఫిష్ కర్రీ, ఫిష్ బిర్యానీ.. ఇలా ఒక్కటేమిటి పది రకాల చేప వంటకాలు నోరూరింపజేయనున్నాయి. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల మృగశిరకార్తె సందర్భంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 8,9,10 తేదీల్లో మూడురోజుల పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఇన్నాళ్లు చేపల పులుసు, ఫ్రై, పచ్చళ్ల రుచి మాత్రమే చూసిన జిల్లా వాసులకు రుచికరమైన వంటకాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ పొందిన మహిళల ఆధ్వర్యంలో ఈ ఫిష్ ఫెస్టివల్ జరగనుంది.

పది రకాల వంటకాలు

స్వయం ఉపాధి పొందేలా అన్ని జిల్లాల మహిళా మత్స్యకారులకు చేపలతో వివిధ రకాల వంటకాల తయారీపై ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో జిల్లాకు చెందినవారు 20మంది ఉన్నారు. ఫిష్ బర్గర్, ఫిష్ సమోసా, ఫిష్ పకోడి, ఫిష్ బిర్యానీ, ఫిష్ సూప్స్, ఫిష్ కట్‌లెట్, స్మోకెడ్, ఫిష్ ఫ్రాన్స్, బట్టర్ ఫ్రై, ఫ్రాన్స్ పకోడి లాంటి పది రకాల చేప వంటకాలతో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ వంటకాలను చాలా తక్కువ ధరకు విక్రయించనున్నారు.

పండగ వాతావరణంలో కార్యక్రమం

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరయ్యే వారికి నోరూరించే పది రకాల చేప వంటకాలతోపాటు వినోదాన్ని పంచేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఫెస్టివల్ నిర్వాహణకు జిల్లాకు రూ.3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఈ ఫెస్టివల్‌లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

జిల్లాలో పుష్కలంగా వనరులు

జిల్లాలో పుష్కలంగా జల వనరులుండగా చేపల పెంపకం, వేటతో వేలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో దాదాపు అన్ని జలాశయాలు, కాలువలు నిండా నీటితో కళకళలాడుతున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలతో మత్స్య సంపద పెరిగింది. నిర్మల్ జిల్లాలోని 648 చెరువుల్లో 143 మత్స్య సహకార సంఘాలకు చెందిన 14వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో 71 మహిళా మత్స్య సహకార సంఘాలున్నాయి. జిల్లాకు చెందిన పలువురు హైదరాబాద్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ వారు చేపలతో వంట పదార్థాల తయారీపై ఇచ్చిన శిక్షణలో పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికే..

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా చేపల వంటకాలను ప్రజలకు పరిచయం చేసి చేపల వినియోగాన్ని మరింతగా పెంచి తద్వారా మత్స్యకారుల ఆర్థిక పురోగతికి దోహదపడాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మృగశిరకార్తెకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రత్యేకత చాటుతాం



తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించనున్నాం. శిక్షణ పొందిన మహిళా మత్స్యకారులతో ఈ పండుగ జరుపుతాం. చేపల ప్రియులకు మూడురోజుల పాటు నోరూరించే రుచులతో భిన్నమైన వంటలను అందుబాటులోకి తీసుకువస్తాం.

– నర్సింహారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

చురుగ్గా 'బెటాలియన్' పనులు

- పూర్తి కావస్తున్న నిర్మాణాలు
- రెండునెలల్లో అందుబాటులోకి..



కొనసాగుతున్న నిర్మాణ పనులు

భైంసాటౌన్: భైంసాలో టీఎస్‌ఎస్పీ రెండో బెటాలియన్ సబ్ హెడ్‌క్వార్టర్స్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే టీఎస్‌ఎస్పీ అదనపు డీజీ స్వాతి లక్రా, డీజీపీ సిద్దిఖి వేర్వేరుగా భైంసాను సందర్శించి పనులు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మూడు మెన్ బారక్, ఒక ఆఫీస్ బారక్‌కు గాను రెండు మెన్ బారక్, కిచెన్, టాయిలెట్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఆఫీస్ బారక్, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది.

రెండునెలల్లో పూర్తిస్థాయిలో..

గతంలో నెలకొన్న అల్లర్ల నేపథ్యంలో ప్రభుత్వం భైంసాకు టీఎస్‌ఎస్పీ రెండో బెటాలియన్‌ను రెండేళ్ల కిందట మంజూరు చేసిన విషయం తెలిసిందే. భైంసా శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో మిర్జాపూర్ వద్ద పదెకరాల విస్తీర్ణంలో నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం రెండు కంపెనీలకు చెందిన బెటాలియన్ సిబ్బంది భైంసాలో విధులు నిర్వర్తిస్తున్నారు. తాత్కాలికంగా పార్డి (బీ) రోడ్డులోని మినీ స్టేడియంలో అరకొర వసతుల మధ్య కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో మిర్జాపూర్ శివారులో బెటాలియన్ పనులు జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం విధించారు. కానీ, పూర్తిస్థాయిలో ఇక్కడి నుంచే విధులు నిర్వహించేందుకు మరో రెండునెలల సమయం పట్టే అవకాశముందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని జయశంకర్ చౌరస్తాలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సినీ, రాజకీయ రంగాల్లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..



ఖానాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆదిలాబాద్ జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు కొండాజీ సాయిప్రసాద్ ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరై ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. నాయకులు తాళ్లపెల్లి రాజేశ్వర్, తొటం సత్యం, ఉప్పుల విజయ్, అజీజ్, బాస కిషన్, అడ్డూరి నాగరాజు, సునీత, నందు, చందేకర్ తదితరులున్నారు.



సోమవార్‌పేటలో అప్పటి గురువులతో పూర్వవిద్యార్థినులు



వద్యాల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



మామడలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దశాబ్దాలు గడిచినా తరగని స్నేహం

- అపూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం

మామడ: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో 1989–1990 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివినవారంతా ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆదివారం ఇదే పాఠశాలలో కలుసుకున్నారు. ఉద్యోగాలు, వివిధ పనుల రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా 33 ఏళ్ల తర్వాత కలుసుకుని పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పెంటయ్య, వెంకటేశ్వర్‌రావ్, నర్సయ్యను ఆహ్వానించి సన్మానించారు. పూర్వ విద్యార్థులు లింగారెడ్డి, రమేశ్‌రెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలం వద్యాల్‌లో..

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్ హైస్కూల్‌లో 1996–97 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివినవారంతా ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆదివారం వద్యాల్‌లోని రాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రఘోత్తమ్‌రెడ్డి, నిర్మల, లక్ష్మణ్, నారాయణవర్మ, గంగన్న, మోహన్‌రావు, వినోద, మంజులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, చిన్న పోతన్న, పోశెట్టి, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని సోమవార్‌పేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆదివారం ఇదే పాఠశాలలో కలుసుకున్నారు. రెండు దశాబ్దాల తరువాత కలుసుకుని రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపి సందడి చేశారు. పోటీల్లో గెలిచినవారికి బహుమతులు అందజేశారు. సెక్షన్ల వారీగా తరగతి గదుల్లో కూర్చుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. భవిష్యత్‌లోనూ ఆత్మీయ సమావేశాలు కొనసాగించాలని, పాఠశాల అభివృద్ధితోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు.



జుమ్మేరాత్ పాఠశాలలో..

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జుమ్మేరాత్ ప్రభుత్వ పాఠశాలలో 2001–2002లో పదో తరగతి చదివి న పూర్వ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు.

క్లుప్తంగా

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న గురువారం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో జూన్ 1న ఉదయం 9 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేటలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులు, మహిళలకు మాస్టర్స్(వెట్రన్స్) 35 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్, 55 ప్లస్, 60 ప్లస్, 65 ప్లస్, 70 ప్లస్, 75 ప్లస్ వయస్సు గల మాస్టర్స్‌కు పోటీలు ఉంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు మే 31 సాయంత్రం 6 గంటలలోగా 9959977929, 8978753944 నంబర్లకు ఫోన్‌చేసి ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు.

గడ్డివాము దగ్ధం



దగ్ధమైన గడ్డివాము

తానూరు(ముథోల్): మండలంలోని బెంబరలో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలి మంటలు చెలరేగడంతో తీగల కింద ఉన్న ఎల్లురి పిరాజీ అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.50 వేల ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

కంటైనర్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఇచ్చోడ(బోథ్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన కంటైనర్‌లో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇచ్చోడ పెట్రోల్ బంక్ వద్ద, గుడిహత్నూర్ మండలంలో దాబా హోటల్ వద్ద, నేరడిగొండ మండల పరిధిలో దాబా హోటల్ వద్ద ఏడుగురు వ్యక్తులు ఏకకాలంలో కంటైనర్‌లో ఉన్న వస్తువులను చోరీ చేశారన్నారు. ఈ కేసులో ఇచ్చోడ సర్కిల్ పరిధిలో ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఆదివారం మొండిగుట్ట వద్ద ఉన్న దాబా హోటల్లో పనిచేస్తున్న ఖాలీద్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో హర్యానకు చెందిన మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

'పోరుగర్జన' విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి ఉద్యోగుల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెంలో తలపెట్టిన ప్రజా పోరుగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేజ్‌బోర్డు ఒప్పందంలో బొగ్గుగని కార్మికులకు అలవెన్స్‌లతో కలుపుకుని 25శాతం వేజెస్ బెనిఫిట్ ఉంటుందన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, మల్లేశ్, నర్సయ్య, సుదర్శన్, లింగయ్య, వెంకటస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దాహం తీర్చని భగీరథ

తరాలు మారినా పల్లె ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెబుతున్న పాలకులు గ్రామాలకు గుక్కెడు నీళ్లు ఇవ్వలేకపోతున్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం ఉద్దేశం మంచిదే అయినప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేలకు మాత్రం తాగునీరు అందడం లేదు. దీంతో గిరిజనులు మంచినీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలం గౌరి కొలాంగూడ (దేవుగూడ)కు చెందిన ఆత్రం జైతుబాయి, ఆత్రం సోంబాయి, సిడాం మత్తుబాయి శనివారం తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లారు. నీళ్లు తోడుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ, గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రామీణులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వెలుగులోకి తెచ్చేందుకు 'సాక్షి' ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించింది.



కిలోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకుంటున్న గోండుగూడ ఆదివాసీలు



కొలాంగూడ (దేవుగూడ)లో బావిలో పడిపోయిన మహిళలను నిచ్చెనసాయంతో రక్షిస్తున్న స్థానికులు



బిందెలతో గుట్ట ఎక్కుతున్న మామిడిగూడ గ్రామస్తులు

- ఆదివాసీ గూడేలకు అందని 'మిషన్'
- వాగులు, బావినీరే గిరిపుత్రులకు దిక్కు
- గుక్కెడు నీటికి కిలోమీటర్ల దూరం నడక..
- బావుల వద్ద ప్రమాదకర పరిస్థితి..
- సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టని పాలకులు
- 'సాక్షి' విజిట్‌తో వెలుగులోకి

కలెక్టర్ సారూ జెర పట్టించుకోండి..

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మూడు గూడేలు ఉన్నాయి. తండా, గొండుగూడ, కొలాంగూడల్లో మొత్తం 700 మంది జనాభా నివాసం ఉంటున్నారు. మూడు గూడేలకు నీటి సౌకర్యం లేకపోవడంతో కొలాంగూడలో ఉన్న ఒకే చేతి పంపుపై ఆధారపడుతున్నారు. గోండుగూడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బిందెడు నీటికోసం దాదాపు రెండు కిలోమీటరు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నెల 5న కలెక్టర్ రాహుల్‌రాజ్ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో కలిసి కాలినడకన వెళ్లి బావిని పరిశీలించారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గిరిజనులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు వారానికి మూడు రోజులు మాత్రమే వస్తున్నాయని, మిగితా రోజులు కష్టాలు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాయకపుగూడలో...



చెలిమల నుంచి నీరు తెచ్చుకుంటున్న నాయకపుగూడ ఆదివాసీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని గోవెన పంచాయతీ పరిధిలోని నాయకపుగూడలో మిషన్ భగీరథ పథకం పనిచేయడంలేదు. దీంతో గ్రామస్తులు కిలోమీటర్ దూరంలో ఉన్న వాగులోని చెలిమల నుంచి నీటిని తెచ్చుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు.

ప్రమాదమని తెలిసినా...



నీటి కోసం బావి వద్ద గుమిగూడిన మహిళలు

నార్నూర్(జైనూర్): కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని గౌరి కొలాంగూడ (దేవుగూడ)లో దాదాపు 200కు పైగా కొలాం గిరిజనులు నివాసం ఉంటున్నారు. గ్రామానికి కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గత్యంతరం లేక గ్రామ సమీపంలో ఉన్న ప్రమాదకరమైన బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. కర్ర మొద్దు సాయంతో బావిలోకి దిగి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పదంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగాపూర్‌లో నీటిగోస



ఎడ్లబండిలో నీటిని తీసుకువస్తున్న గ్రామస్తుడు

బోథ్: మండలంలోని నాగాపూర్‌లో 671 మంది జనాభా ఉన్నారు. గతంలో గ్రామంలో 10 బోర్లు వేశారు. వీటిలో రెండు చేతిపంపులు కూడా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో అందులోంచి చుక్కనీరు కూడా రావడం లేదు. దీంతో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జైనూర్ పల్లె గ్రామంలోని ఓ బోరు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకుని పైపుల ద్వారా గ్రామానికి దగ్గర్లో ఉన్న ఓ బావిలో నీటిని నింపుతున్నారు. ఈ నీటినే గ్రామస్తులు తాగడానికి, నిత్యావసరాలకు ఉపయోగిస్తున్నారు. ఈ పైపులైన్లను కూడా గ్రామస్తులు సొంత ఖర్చుతో వేసుకోవడం గమనార్హం. ఇలా బావి నింపడానికి పనులు మానుకుని రోజుకు కుటుంబానికి ఒకరు చొప్పున వంతులు వేసుకుని ఇంటి పట్టునే ఉంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పథకం నీటిట్యాంకు ఉన్నా ఏడాది కాలంగా లీకేజీల సమస్యతో నీటి సరఫరా కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

దాహం తీరదు



నల్లా వద్ద క్యాన్లతో యువకులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు, 23,543 మంది జనాభా, 7,510 గృహాలు ఉన్నాయి. ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా పది ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. మున్సిపాలిటీ పరిధిలోని మహంకాళివాడ, నాయీ బ్రాహ్మణవీధి, శివాలయం వీధి, పద్మశాలి కాలనీ, ఇందిరానగర్, ఎస్‌పీవాడ, రజకవాడ, కొత్తగూడెం కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణ సమీపంలోని మదనం పోచమ్మ వద్ద గల నల్లా నీటిని తీసుకెళ్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు



బోరుబావి వద్ద మామిడిగూడ గ్రామస్తులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండలంలోని అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. భూగర్భ జలాలు అడుగంటి మంచి నీటి పథకాలు పని చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మామిడిగూడకు నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామానికి దూరంలో ఉన్న వ్యవసాయ బోరుబావి నుంచి బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి తమ గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏటా ఇబ్బందులే..

కౌటాల: కన్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కన్నెపల్లిలో 30 కుటుంబాలు, 130 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో చేతిపంపు, బావినీరు తాగుతున్నారు. లేదంటే రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న బోదంపల్లికి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని, ఏటా వేసవిలో ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు.



బావి వద్ద బారులు తీరిన మహిళలు

గిరితండాల్లో...



నల్లా వద్ద తాగు నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

తానూరు(ముథోల్): మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఝరి(బి)తండాలో 250 కుటుంబాలు 700ల జనాభా ఉన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రూ.13 లక్షలు వెచ్చించి పైప్‌లైన్ వేశారు. కానీ పైపులైన్ లీకేజీల కారణంగా నీరు సరఫరా కావడం లేదు. త్రీఫేజ్ విద్యుత్ ఉన్న సమయంలో నల్లా వద్ద నీటిని పట్టుకుంటున్నామని, విద్యుత్ లేని సమయంలో వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెండాగూడలో...

తాంసి(బోథ్): భీంపూర్ మండలం కమట్‌వాడ పంచాయతీ పరిధిలోని జెండాగూడలో ప్రజలు తాగునీటికి అనేక ఇక్కట్లు పడుతున్నారు. వారానికి ఒకసారి మాత్రమే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. దీంతో గ్రామంలో ఉన్న 20 కుటుంబాలు గ్రామ సమీపంలో ఉన్న చేతిపంపు వద్ద వంతుల వారీగా వేచి ఉంటూ నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతిరోజు మిషన్ భగీరథ నీటిని విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చేతిపంపు వద్ద బిందెలతో మహిళలు

'అభివృద్ధిపై సీఎంకు చిత్తశుద్ధి లేదు'



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

కడెం: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై సీఎంకు చిత్తశుద్ధి లేదని, కేసీఆర్‌ను గద్దె దింపడానికి రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్ సమావేశానికి వెళ్లి రాష్ట్రానికి కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాల్సిన సీఎం సమావేశానికి డుమ్మా కొట్టి హైదరాబాద్‌లో ఢిల్లీ, పంజాబ్ సీఎంలను కలుసుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రధాని మోదీ అధికారంలో వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ముక్కెర గంగాధర్, ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు భీమన్న, నాయకులు తిరుమల్, భూమారెడ్డి, శ్రీనివాస్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'



మాట్లాడుతున్న వినోద్‌నాయక్

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఖానాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని, సమస్యలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. నియోజకవర్గం ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు పాలించిన నాయకులు కేవలం వారి కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారే తప్ప నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏం చేయలేదన్నారు. ప్రజలకు హక్కులు కల్పించడంలో విఫలమైన కలెక్టర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులని ప్రతివాదులుగా చేర్చి ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫిరాజీ, భావ్‌రాజ్, శ్రీనుగౌడ్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా అత్యంత ప్రతిభ కనబరిచిన 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు 10 రోజుల శిక్షణ అనంతరం జూన్ రెండో వారం నుంచి హైదరాబాద్‌లో జరుగబోయే జిల్లాస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కోచ్ పోరండ్ల ప్రదీప్ తెలిపారు. ఎంపికైన వారిలో క్రీడాకారులు జగదీశ్‌రెడ్డి, సాత్విక్, ఎండి హుర్రైర్, మనోజ్, అనిరుద్, సంతోశ్, అబ్దుల్, రెహమాన్, వర్షిత్, లక్ష్మణ్, సింహాద్రి, గణేశ్, సాయికుమార్, డి.రామ్, జై గణేశ్, నితిన్, రూబు, షేక్ షాదాబ్, రెహాన్, అబ్దుల్ కైఫ్, సుభాష్, అర్జున్, తరుణ్, అజయ్ రాథోడ్, యువరాజ్, విష్ణుతేజ, అవినాశ్, ఆంజనేయులు, కార్తికేయ ఉన్నారు.

దేశీదారు పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టుబడినట్లు ఎస్సై డి.సాగర్ తెలిపారు. రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన జాడి కేశవ్ ఆదివారం 76 దేశీదారు (90ఎంఎల్) బాటిళ్లను మహారాష్ట్ర నుంచి తీసుకువస్తూ వాంకిడి మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పట్టుబడినట్లు తెలిపారు. దేశీదారు విలువ సుమారు రూ.4వేలు ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడాకారులతో బాలూరి గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: నిరంతర సాధనతో ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒకినోవా కరాటే మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదివారం అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మార్షల్ ఆర్ట్స్ కేవలం ఆత్మ రక్షణ కోసం తోడ్పాటును అందించేదని, నేడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని వేదికలలో పోటీ పడవచ్చన్నారు. జిల్లాకు చెందిన కరాటే శిక్షకులు చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో జిల్లా పేరును ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు రవికాంత్, శిక్షకులు పాల్గొన్నారు.



సోలార్ పంపు ద్వారా సాసర్‌వెల్‌లోకి వస్తున్న నీరు



పాత మామిడిపల్లి నీటి కుంట

మండు వేసవిలో నిండుకుండలా..

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు అధికారులు ఏర్పాటు చేసిన నీటి కుంటలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. తాళ్లపేట్ రేంజ్‌లోని పాత మామిడిపల్లి ఊట్ల సమీపంలో సహజసిద్ధంగా గుట్టపై నుంచి వస్తున్న నీటికి ఆనకట్ట వేశారు. అక్కడి నుంచి కాలువల ద్వారా మరో రెండు కుంటలను నింపారు. దీంతో మండు వేసవిలో కూడా కుంటల్లో నీరు నిల్వ ఉంటోంది. జన్నారం రేంజ్, ఇందన్‌పల్లి రేంజ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పంపుల ద్వారా సాసర్ వెల్, నీటికుంటలకు నీరు వదలడం ద్వారా వన్య ప్రాణులకు ఇబ్బంది లేకుండా మారింది. ఆయా రేంజ్‌ల పరిధిలో ఊట ద్వారా నీరు వచ్చేలా ఏర్పాటు చేసిన ర్యాంప్‌వెల్‌లు మండే ఎండల్లో కూడా మూగజీవాల దాహార్తి తీరుస్తున్నాయి.



ర్యాంప్‌వెల్‌లో నిండుగా ఉన్న నీరు